సాక్షి
కుమురం భీం
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



స్వేచ్ఛగా బతకనియ్యండి..
ఏటా అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అటవీశాఖ అధికారులు వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. 8లో▸



గుండెపోటుతో ఆర్డీవో మృతి
కాగజ్‌నగర్ ఆర్డీవో జాడి రాజేశ్వర్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా కేంద్రంలో రెవెన్యూ ఉద్యోగులు నివాళులర్పించారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.2 /23.3
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ పది, ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు
ఆసిఫాబాద్‌రూరల్: ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల గడువు పెంచినట్లు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు ప్రవేశాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ప్రధాని శంకుస్థాపన
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ శివారులో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్యకళాశాలలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం నిజామాబాద్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలో 20 క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు శంకుస్థాపన ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ బ్లాక్ పూర్తయితే జిల్లాలో తీవ్ర అనారోగ్యం బారిన పడిన వారికి, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందుబాటులోకి వస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్న రోగులకు వెంటిలేటర్లు అమర్చడం, బీపీ, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు క్రిటికల్ కేర్ బ్లాక్‌లో చికిత్స అందిస్తారని వైద్యాధికారులు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలి

పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్: విశ్రాంత ఉద్యోగులకు డీఏ/డీఆర్ బకాయిలు చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు 5 శాతం ఐఆర్ ప్రకటనతోపాటు పీఆర్‌సీ కమిషన్ వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 18 శాతం ఐఆర్ చెల్లించాల్సి ఉండగా కేవలం 5 శాతం మాత్రమే మంజూరు చేయడం ఉద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ఇంటీరియర్ రిలీఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయాలని, ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో గుర్రాల వెంకన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థితో అధికారులు, ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌టౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 2న నిర్వహించిన జోనల్ స్థాయి ఉషూ పోటీలు కాగజ్‌నగర్ విద్యార్థులు సత్తా చాటినట్లు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్ విద్యార్థి బి.బిందూషా 36 కేజీల విభాగం, ట్వింకిల్ రాయ్ 40 కేజీల విభాగం, ఫైజాన్ 48 కేజీలలో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలను సాధించారని పేర్కొన్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం డీఈవో అశోక్, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, ఫాతిమా కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ సాఫల్యా, కృష్ణప్రసాద్, ఏడుకొండలు, దేవయ్య అభినందించారు.

కనీస వేతనం చెల్లించాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చెన్నకేశవులుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఉపేందర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో సీహెచ్‌సీ ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారని అన్నారు. పనిభారం తగ్గించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు దివాకర్, సిబ్బంది మల్లేశ్, హరీశ్, రవీందర్, మమత తదితరులు పాల్గొన్నారు.

పవర్ పాలిట్రిక్స్!

- బీఆర్‌ఎస్ నేతల దూకుడు
- ప్రతిపక్ష పార్టీ నాయకులపై కేసులు
- కక్ష సాధింపులకు దిగుతున్న తీరు
- తాజాగా ఓ నేతపై కేసు నమోదుకు యత్నం
- ప్రచార వాహనాన్ని సీజ్ చేయాలంటూ హుకుం
- రసవత్తరంగా జిల్లా రాజకీయం



సాక్షి, ఆసిఫాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో రాజకీయ వేడి మరింతగా రాజుకుంటోంది. అధికార పార్టీ, ప్రధాన విపక్ష పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొంటున్నాయి. విజయమే లక్ష్యంగా బరిలో దిగుతున్న అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతలు.. తమ సమీప అభ్యర్థులపై ఆధిపత్యం చెలాయించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. అత్యవసరమైతే తమ అమ్ములపొదిలో ఉన్న 'పవర్'ను చివరి అస్త్రంగా ఉపయోగించేందుకు సైతం వెనుకాడడం లేదని తెలుస్తోంది. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలే అందుకు కారణమని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఆసిఫాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కాదని, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి టికెట్ కేటాయించింది. సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీల్లో అభ్యర్థులెవరన్నది నేటికీ తేలలేదు. సిర్పూర్‌లో బహుజన్ సమాజ్ పార్టీ మాత్రం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మొదటి విడత జాబితాలోనే టికెట్ ఖాయం చేసింది. దీంతో అక్కడ చతుర్ముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుంచి కోర్శల్ల కృష్ణారెడ్డి, రావి శ్రీనివాస్ టికెట్‌ను ఆశిస్తుండగా.. బీజేపీ నుంచి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుతోపాటు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ సైతం పోటీ పడుతున్నారు. ఇక ఆసిఫాబాద్ విషయానికొస్తే కాంగ్రెస్ నుంచి డాక్టర్ గణేష్ రాథోడ్, శ్యాం నాయక్, మర్సుకోల సరస్వతి టికెట్ కోసం ముమ్మర యత్నాలు చేస్తున్నారు. ఇంత వరకు అంతా బాగానే ఉన్నప్పటికీ.. అధికార పార్టీ అభ్యర్థులు మాత్రం తమకు గట్టి పోటీ ఇస్తారనుకునే ప్రతిపక్ష పార్టీల నేతలపై ఓ కన్నేసి ఉంచినట్లు సమాచారం. వారు ఏ చిన్న తప్పు చేసినా దానిని భూతద్దంలో చూపాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

కన్నెర్రజేస్తే.. కేసు పెట్టాల్సిందే!
రానున్నది ఎన్నికల సమయం. చేతిలో అధికారం ఉండనే ఉంది. అధికారపార్టీ నేతలు చెప్పినట్లుగా అధికారులు నడుచుకోవాల్సిందే. లేదంటే బదిలీ బహుమతి ఖాయం. ఈ నేపథ్యంలో అడకత్తెరలో చిక్కిన వక్క మాదిరిగా తయారైంది జిల్లా అధికారుల తీరు. ముఖ్యంగా పోలీసు అధికారుల కష్టాలు వర్ణనాతీతమనే చెప్పాలి. ఆసిఫాబాద్‌లో పది రోజుల కిందట ఓ కుల సంఘం సభ్యులంతా సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడి పనితీరుపై సభ్యులు ప్రశ్నించినట్లు సమాచారం. ఇక అంతే ఆ సంఘం అధ్యక్షుడు అధికార పార్టీ నేతకు సంఘ సభ్యులపై ఫిర్యాదు చేయడమే తరువాయి.. పదిహేను మందిపై పోలీసు కేసు నమోదైంది. సంఘ అధ్యక్షుడిపై దాడికి యత్నించినట్లుగా సెక్షన్లు పెట్టారు. ఒక్కడి కోసం అంతమందిపై ఎందుకు కేసు పెట్టారని ఆరా తీస్తే.. వారంతా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారని తేలడం గమనార్హం. తాజాగా సోమవారం కూడా ప్రతిపక్ష పార్టీ ఆశావహుడిపై కేసు నమోదుకు ఆసిఫాబాద్ అధికార పార్టీ నేత పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఏకంగా అతడిపై కేసు నమోదు చేయడమే కాకుండా అతని ప్రచార రథాన్ని సైతం సీజ్ చేయాలని పోలీసు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇలా నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారనే విమర్శలున్నాయి. సిర్పూర్ నియోజకవర్గ అధికార పార్టీ నేత మాత్రం ప్రతిపక్ష పార్టీ నేతలకు దీటుగా ప్రతి మండలం, గ్రామంలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. అయితే బీఎస్పీకి చెందిన కొందరి నేతలపై మాత్రం తనదైన శైలిలో విరుచుకుపడటమే కాకుండా.. వారికి అండగా నిలుస్తున్న వారిపై కన్నెర్రజేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది. మొత్తమ్మీద జరుగుతున్న పరిణామాలను చూస్తే అధికార పార్టీ నేతలు కన్నెర్రజేస్తే మాత్రం ప్రత్యర్థి పార్టీల నేతలకు కష్టాలు తప్పవన్న సంకేతాలు జిల్లాలో రసవత్తర రాజకీయాలకు అద్దం పడుతోందని విశ్లేషకులు అంటున్నారు.

క్రీడాభివృద్ధికి పంచాయతీలకు కిట్లు పంపిణీ


కిట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రామ పంచాయతీలకు క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి క్రికెట్, వాలీబాల్, టీషర్టులు, తదితర సామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు చదువుతోపాటు శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. జిల్లాలోని యువత స్పోర్ట్స్ కిట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు క్రీడాకారులకు సామగ్రి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు గుండెపోటుతో మృతి చెందిన కాగజ్‌నగర్ ఆర్డీవో జాడి రాజేశ్వర్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును అనుసరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: హైకోర్టు తీర్పును అనుసరించి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న బదిలీల్లో ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కారావు, భీంరావు, రాము తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రేపు వాహనాల వేలం

ఆసిఫాబాద్: జిల్లాలో అక్రమ రవాణా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సన్నబియ్యం పంపిణీ ఎప్పుడో..?

- అంగన్‌వాడీ కేంద్రాలకు అందని వైనం
- ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 973 కేంద్రాలు


భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించి ఏళ్లుగా గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటివరకు తమకు ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతుండగా.. దొడ్డు బియ్యంతో భోజనం చేసేందుకు కేంద్రాలకు వచ్చేవారు ఇష్టపడటం లేదు. ప్రస్తుతం చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు మూసి ఉంచడంతో పోషకాహార పంపిణీకి అంతరాయం ఏర్పడుతోంది.

ప్రస్తుతం ఫోర్టిఫైడ్ బియ్యం

జిల్లాలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 834, మినీ కేంద్రాలు 139 ఉన్నాయి. మొత్తం 973 సెంటర్లలో 46,707 మంది చిన్నారులు, 5,540 గర్భిణులు, 3,967 బాలింతలు ఉన్నారు. ప్రతినెలా ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం నుంచి క్వింటాల్‌కు పైగా బియ్యం సరఫరా అవుతోంది. ప్రస్తుతం పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. చిన్నారులకు 75 గ్రాములు, బాలింతలకు 150 గ్రాముల భోజనం వడ్డిస్తున్నారు. వివిధ కూరగాయలు, ఇతర పోషక విలువలతో కూడిన భోజనం వడ్డిస్తున్నా దొడ్డు బియ్యం కారణంగా అనేక మంది తినేందుకు ఇష్టపడటం లేదు. ముఖ్యంగా చిన్నారులు పోషకాహారానికి దూరమవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఏళ్లు గడుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సన్నబియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. అయితే వివిధ కారణాలతో అమలు వాయిదా పడుతోంది. ఇప్పటికైనా సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సరఫరా కావడం లేదు
అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీ జరగడం లేదు. ప్రభుత్వం ప్రకటించినా సెంటర్లకు సరఫరా మాత్రం కావడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి బియ్యం పంపిణీ అయితే జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తాం.

– సావిత్రి, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి

'మహిళ'కు ఆరోగ్య బాసట

- జిల్లాలో నాలుగు మహిళా ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటివరకు 3,787 మందికి పరీక్షలు
- ఆరోగ్య సలహాలు అందజేస్తున్న వైద్యులు


పెంచికలపేట్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న డా.సేహా

పెంచికల్‌పేట్(సిర్పూర్): మహిళల్లో దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీల్లో మహిళా ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది మార్చి 8వ జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెధరి, దహెగాం పీహెచ్‌సీల్లో ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఆ తర్వాత సెప్టెంబర్ 12న పెంచికలపేట్, కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి తెచ్చారు. ఆయా కేంద్రాల్లో ప్రతీ మంగళవారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సెప్టెంబర్ వరకు 3,787 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 184 మందిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఆయా కేంద్రాల్లోని మహిళా వైద్యుల పర్యవేక్షణలో అతివలలకు ప్రత్యేక వైద్యం అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు.

57 రకాల వైద్యపరీక్షలు

ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాల్లో మొత్తం 57 రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఎనిమిది రకాల వ్యాధులను నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే క్యాన్సర్, పౌష్టికాహార లోపం, మూత్రకోశ సమస్యలు, మోనోపాజ్, కుటుంబ నియంత్రణ, సంతానలేమి, నెలసరి సమస్యలు, సుఖవ్యాధులు, తక్కువ శరీర బరువుతోపాటు విటమిన్, సీబీపీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వివరాలను ప్రత్యేకంగా ఆరోగ్య కార్డులో నమోదు చేస్తున్నారు. అలాగే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని నిపుణులైన మహిళా వైద్యులు, సిబ్బందితో ఆరోగ్య సలహాలు అందజేస్తున్నారు.

అందుబాటులో సేవలు

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యపరీక్షలు చేయించుకునేందుకు మహిళలు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో మహిళా ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించింది. ప్రస్తుతం నాలుగు కేంద్రాల్లో మహిళలకు పరీక్షలు చేస్తున్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు నామమాత్రంగా పరీక్షలు నిర్వహించగా, నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రత్యేక వసతులు కల్పించారు. మహిళా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. దీంతో మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవడానికి ముందుకొస్తున్నారు.

సెప్టెంబర్ వరకు నిర్వహించిన పరీక్షలు

రొమ్ము క్యాన్సర్ ఎగ్జామినేషన్	1,857
వీఐఏ టెస్టులు	454
ఓరల్ కావిటీ	2,305
యూటీఐ	206
మైక్రోన్యూట్రీషియన్	313
థైరాయిడ్	403
విటమిన్ డి	317
సీబీపీ	567

వ్యాధుల బారిన పడకుండా..
మహిళా ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకున్న వారిలో 184 మందికి రొమ్ము క్యాన్సర్ గుర్తించాం. దీంతో పాటు విటమిన్–డి, సీబీపీ ఇతర పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాల ద్వారా పరీక్షలు నిర్వహించడంతోపాటు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు వివరిస్తున్నాం. మహిళలు ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో

మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి


మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసె శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలీ కులస్తులను బీసీలుగా గుర్తించడంతో రాజకీయంగా, ఆర్థికంగా అన్నిరంగాల్లో వెనుకబడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఎస్టీ హోదా కోసం ఉద్యమిస్తున్నా.. ప్రభుత్వాలు తమను ఓటు బ్యాంకుగా వాడుకొని మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంరావును సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిపేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు గోపాల్, నాందేవ్, బాబురావు, సోమ పటేల్, మారుతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అరుదైన అవకాశం

- భారతీయ యువశక్తి ట్రస్ట్‌తో కళాశాల అవగాహన ఒప్పందం
- పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విద్యార్థులకు తోడ్పాటు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కనుంది. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ భారతీయ యువశక్తి ట్రస్ట్ కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్ సహకారంతో స్థానిక విద్యార్థులు, యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా కృషి చేయడానికి తోడ్పాటును అందించనుంది. ఇందులో భాగంగా స్థానిక వినయ్ గార్డెన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భారతీయ యువశక్తి ట్రస్ట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. వ్యాపార రంగంపై ఆసక్తిగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అన్నిరకాలుగా సహకారం అందిస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి కావాల్సిన మార్గదర్శకత్వం సంస్థ ద్వారా అందనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి భారతీయ యువశక్తి ట్రస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అరుణా వినోద్‌కుమార్ ఒప్పంద పత్రాలను మంగళవారం ప్రిన్సిపాల్‌కు అందించారు. కార్యక్రమంలో సిర్పూర్ పేపర్‌మిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సురేందర్ బెహాని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

తిర్యాణి(ఆసిఫాబాద్): అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో తుకారాం అన్నారు. సంకల్ప్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో హెల్త్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కింద దేశవ్యాప్తంగా ఐదు వేల బ్లాకులను గుర్తించగా అందులో తిర్యాణి మండలం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భవ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయాల ఎదుట 'ఆశా'ల ధర్నా


జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అంతకు ముందు దీక్ష శిబిరం నుంచి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి మూలస్తంభాలుగా నిలుస్తున్న ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. డిమాండ్లు నెరవేర్చేవరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదేలు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు శాంత, అమృత, రోజా, సునీత, కృష్ణవేణి, రాంబాయి, నవీన, భారతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ఆర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, జమీల, పంచశీల, గౌరుబాయి, శోభ, లక్ష్మి, కవిత, అనురాధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు ఇసుక లారీల ఢీ

జైపూర్: మండల కేంద్రంలోని మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారిపై మంగళవారం రెండు ఇసుక లారీలు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వెళ్తున్న లారీలుగా అతివేగంగా జైపూర్ బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న ఇసుక లారీని వెనుకాల వెళ్తున్న మరో ఇసుక లారీ బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న లారీ క్యాబిన్ మొత్తం నుజ్జునుజ్జుగా మారింది. లారీ డ్రైవర్ దశరథ్‌కు గాయాలయ్యాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దొరగారి పల్లి సమీపంలో నేషనల్ హైవే రైల్వేట్రాక్ పక్కన నాలాలో సుమారు 40– 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు ఒంటిపై చిన్న టవల్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామని పేర్కొన్నారు. వివరాలకు నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


తిరుపతి(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని కిరిడి గ్రామానికి చెందిన వసకే తిరుపతి(18)సోదరిని ఆసిఫాబాద్‌లో బైక్‌పై తీసుకువచ్చి దించాడు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా ఆసిఫాబాద్ జన్కాపూర్ వద్ద పోలీసుల వాహనాల తని ఖీలు చేపట్టారు. గమనించిన తిరుపతి వారిని తప్పించుకుని రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం సాలేగూడ వద్ద ఎదురుగా ఢీకొ ంది. ఈ ప్రమాదంలో తిరుపతి మృతిచెందాడు. బైక్ సైతం కాలిపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ఒకరికి ఐదేళ్ల జైలు

నెన్నెల: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మారెడ్డిపై హత్యాయత్నం చేసిన అతడి అన్న బద్దం బాపురెడ్డికి మంచిర్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అర్పితమారం రెడ్డి ఐదు సంవత్సరాల జైలు శిక్ష , వెయ్యి రూపాయల జరిమానా విధించారు. నెన్నెల ఎస్సై శ్యాంపటేల్, లైజన్ ఆఫీసర్ గులాం దస్తగిర్ వివరాలు వెల్లడించారు. అన్నదమ్ములకు భూ పంపకాల్లో గొడవలు జరుగుతుండగా విరాసత్ కోసం 2018 జూన్ 13న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన లక్ష్మారెడ్డిపై అక్కడే కళ్లల్లో కారం చల్లి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి ఎస్సై చందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశాడు. పేర్కొన్నారు. పోలీసులు కోర్టులో సాక్ష్యాదారాలను ప్రవేశపెట్టగా అదనపు పీపీ మదన్ మోహన్ బాధితుడి పక్షాన వాదించి నేరనిరూపన చేశారని తెలిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు తుది తీర్పు వెలువరించిందని చెప్పారు.

స్వేచ్ఛగా బతకనియ్యండి..

- వన్యప్రాణులకు రక్షణగా అనేక చట్టాలు
- అటవీ జంతువుల రక్షణ బాధ్యతగా తీసుకోవాలి
- ప్రారంభమైన వన్యప్రాణి వారోత్సవాలు


వన్యప్రాణులు

జన్నారం: భూమిపై ప్రకృతి అందాలకు కొదవ లేదు. అందమైన చెట్లు, వృక్షాలు, దట్టమైన అడవులు ప్రకృతి సౌందర్యాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ప్రకృతి ఒడిలో అలరాడుతూ తిరిగే వన్యప్రాణులకు స్వచ్ఛ కరువవుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ ఎన్నో రకాల వన్యప్రాణులకు పుట్టినిల్లు. ఈ అడవిలో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, దుప్పులు, సాంబర్లు, కొండగొర్రెలు, జింకలు, కుందేళ్లు, ముళ్లపందులు, పందులు లాంటి వన్యప్రాణులతో పాటు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు లాంటి ఎన్నో మృగాలు కూడా ఈ అడవిలో జీవిస్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యం 1965లో వన్యప్రాణుల విభాగంగా (వైల్డ్‌లైఫ్)గా ఏర్పాటు చేశారు. వీటి రక్షణ కోసం 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహించే వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

తగ్గిన వన్యప్రాణుల వేట..

ఎత్తైన టేకు వృక్షాలతో దట్టమైన అడవిగా ఉన్న కవ్వాల్ అభయారణ్యం 2,015 స్క్వేర్ కిలోమీటర్ల వైశాల్యంతో ఉంది. వన్యప్రాణ చట్టం ప్రవేశపెట్టిన అనంతరం కవ్వాల్ అభయారణ్యం వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. అప్పటి నుంచి వన్యప్రాణులను వేటాడిన, హాని కలిగించిన చట్టాల ప్రకారం శిక్షలుండేవి. ఆ శిక్షలు పూర్తి స్థాయిలో అమలయ్యేవికావు. చట్టాలపై అవగాహన లేక కొందరు న్యప్రాణులను వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకునేవారు. కాని ఇక్కడి దట్టమైన అడవులను, వన్యప్రాణులకు కావాల్సిన ఆహారాన్ని పరిశీలించిన టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, కేంద్ర ప్రభుత్వం 12 ఏప్రిల్ 2012లో ఈ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ప్రకటించింది. ఇందుకు 893 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియా, 1123 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియాను కేటాయించారు. ఒకప్పుడు వన్యప్రాణుల వేటకు చిరునామాగా మారిన ఈ ప్రాంతం టైగర్‌జోన్ ఏర్పాటుతో వేట తగ్గింది. ఈ టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. కఠినమైన చట్టాలను అమలు చేయడంతో మెల్లమెల్లగా వన్యప్రాణుల వేట తగ్గుముఖం పట్టింది.

ప్రత్యేక సౌకార్యాలు..

జన్నారం అటవి డివిజన్ వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. డివిజన్‌లోని 40 బీట్‌లలో గడ్డి క్షేత్రాలను విరివిగా ఏర్పాటు చేశారు. నీటి కుంటలు, అవాసానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడేళ్లుగా అడవుల్లోకి పశువులు వెళ్లకుండా కట్టడి చేశారు. అలజడి లేక వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది.

అవగాహన కోసం వారోత్సవాలు

వన్యప్రాణుల రక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈ వారోత్సవాల్లో ప్రతీ రోజు ఒక కార్యక్రమం చేస్తూ అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వేటాడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ శిక్షలు పడేలా చేయడంతో వేటా ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది.


వన్యప్రాణుల కోసం పెంచుతున్న గడ్డి

షెడ్యూల్ ఇలా...

ఈ వారోత్సవాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నారు. మొదటి రోజు అక్టోబర్ 2న అవగాహన ర్యాలీ, అక్టోబర్ 3న డివిజన్‌లోని రేంజ్‌ల పరిధిలో ఫుట్ పెట్రోలింగ్, 4న విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, 5న జన్నారం రేంజ్ పరిధిలోని బైసన్‌కుంట వద్ద విద్యార్థులకు అవగాహన సదస్సు, 6న బైసన్ కుంట వద్ద బర్డ్ వాక్ కార్యక్రమం, 7న సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలకు అవగాహన, 8 న అటవీశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, విద్యార్థులచే బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కఠినమైన చట్టాలు

వన్యప్రాణులను వేటాడిన, వాహనంతో ఢీకొట్టి చంపిన కఠినమైన చట్టాలున్నాయి. 1972 ఆక్ట్ ప్రకారం 6 నెలల నుంచి 8 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటుగా రూ.3వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా ఉంది. షెడ్యూల్ 1 కిందికి వచ్చే పులి, చిరుత, ఎలుగుబంటి లాంటి అంతరిస్తున్న జంతువులను వేటాడిన వారికి ఎనిమిదేళ్ల జైలు శిక్ష ఉంటుంది. షెడ్యూల్ 2 కిందికి వచ్చే మిగతా జంతువుల వేటాడిన చంపిన 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

వన్యప్రాణులకు అన్ని రకాల సౌకర్యం



వన్యప్రాణుల సంరక్షణకు పెద్దపీట వేశాం. జన్నారం డివిజన్ పరిధిలో వన్యప్రాణులకు పలు రకాల గడ్డి క్షేత్రాలను పెంచుతున్నాం. వన్యప్రాణులకు నీరు, ఆహారం, అవాసం ఒకేచోట ఉండేలా చూస్తున్నాం. రాత్రి, పగలు, బేస్‌క్యాంపు, అటవీ సిబ్బందితో పెట్రోలింగ్ చేపిస్తున్నాం. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. వన్యప్రాణులను వేటాడిన, హాని కలిగించినా కఠినమైన శిక్షలు పడే చట్టాలున్నాయి. వన్యప్రాణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నాం.

– మాధవరావు, ఎఫ్‌డీవో

108లో ప్రసవం..


బిడ్డను చూపిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన పుష్పలత నిండు గర్భిణి. మంగళవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో పైలెట్ సత్తయ్య అంబులెన్స్‌ను పక్కకు నిలుపగా, ఈఎంటీ నర్సయ్య ఆమెకు డెలివరీ చేయగా మగ బిడ్డను ప్రసవించింది. వెంటనే ఆ ఇద్దరిని జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

15న ఉమ్మడి జిల్లా ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సెయింట్‌మేరీ హైస్కూల్‌లో ఈ నెల 15న ఉదయం 9గంటలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివప్రసాద్ ఆదేశాల మేరకు అర్జున్ చెస్ అకాడమీ వారి సౌజన్యంతో చెస్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఉదయం 9గంటల్లోగా సెయింట్ మేరీ హైస్కూల్లో రిపోర్టు చేయాలని, ఆసక్తి గల వారు వివరాలకు చీఫ్ ఆర్బిట్రేటర్ రామయ్యను సెల్ నం. 89780 26306 సంప్రదించాలన్నారు. ఈ నెల 14లోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

డీపీఈ గైడ్‌లైన్స్‌ను రద్దు చేయకుంటే సమ్మె


గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: కోలిండియాలో డీపీఈ గైడ్‌లైన్స్‌ను రద్దు చేయాలని, లేకుంటే ఈ నెల 12,13,14 తేదీల్లో ఐదు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె తప్పదని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి హెచ్చరించారు. మంగళవారం ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల రంగం ఈ గైడ్‌లైన్స్‌తో ఇబ్బందులు పడే అవకాశం ఉందని, దానిని దృష్టిలో ఉంచుకొని గతంలో చైర్మన్‌కు వినవించగా సవరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గైడ్‌లైన్స్‌ను రద్దు చేసేంత వరకూ ఐదు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోరటాలు తప్పవని పేర్కొన్నారు. సమావేశ అనంతరం గని మేనేజర్ భూ శంకరయ్యకు వినతి పత్రం అందించారు. ఫిట్ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వడ్ల కొండ శివ, చైతన్య రెడ్డి, కల్వల శ్రీనివాస్, దొండ నవీన్, ఆదర్శ్, తిరుపతి నాయక్ ఉన్నారు.

వంట 'మాస్టర్లు'గా..


మధ్యాహ్న భోజనం వండుతున్న టీచర్లు

నెన్నెల: ప్రభుత్వం ఇస్తున్న బిల్లులు చాలడం లేదని, వంట బిల్లులు రావడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో ఉండడంతో పలు పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం సరిగా అందడం లేదు. దీంతో ఉపాధ్యాయులే వంట వార్పు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠాలు బోధించే గురువులే మంగళవారం రెండు గంటల పాటు భోజనం తయారు చేసి 150మంది విద్యార్థులకు వడ్డించారు. ప్రధానోపాధ్యాయుడు దండనాయకుల ప్రకాష్‌రావు తన సొంత డబ్బులతో కూరగాయలు, సన్న బియ్యం తెచ్చి విద్యార్థుల ఆకలి తీర్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక వంట నిర్వాహకులను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సింగరేణిని విముక్తి చేయాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య


మాట్లాడుతున్న వీ సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిని రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల చేతుల నుంచి విముక్తి చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.29వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ వేతన ఒప్పందంలో ఉద్యోగుల వేతనాల పెరుగుదలపై అధికారులు కోర్టులో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 12, 13, 14 తేదీల్లో దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల్లో జాతీయ సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, నాయకులు రాచర్ల చంద్రమోహన్, మోహన్ రెడ్డి, నరసింహారావు, అఫ్రోజ్ ఖాన్, శంకర్, సత్తయ్య సుధాకర్ ఉన్నారు.

రెండు రోజుల్లోనే చోరీ కేసు ఛేదించిన పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- చోరీకి గురైన సొత్తు రికవరీ


మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేషనల్ హైవే పక్కన ఉన్న అర్జయ్య ఇంట్లో దొంగతనం జరిగి బంగారం, వెండి అపహరణకు గురి కాగా రెండు రోజుల్లోనే పోలీసులు దొంగలను పట్టుకొని చోరీకి గురైన సొత్తును రికవరీ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన ఏదుల దీపక్, గాంధీనగర్‌కు చెందిన మేకల అశోక్, అంకుశంకు చెందిన ముద్దం సాయికిరణ్ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత నెల 30న హైవే పక్కన ఉన్న ఇంట్లో దొంగతనం చేసి బంగారం, వెండి నగలు అపహరించారు. గతంలో హాజీపూర్, సోమగూడం, నస్పూర్‌లలోని దేవాలయాల్లో దొంగతనాలు చేసి అరెస్ట్ అయి శిక్ష అనుభవించారు. తర్వాత రెండు సంవత్సరాల క్రితం బెల్లంపల్లిలోని కన్నాల వద్ద దీపక్ బోర్‌వెల్స్ అనే షాపు పెట్టి గ్రామాలలో బోరు వేస్తుండగా అశోక్, కిరణ్‌లు వచ్చి బోరు కోసం దీపక్‌ను కలవడంతో ముగ్గురికి పరిచయం ఏర్పడింది. జల్సాలకు అలవాటుపడి, తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోమగూడంలో ఏడున్నర తులాల బంగారం, పది తులాల వెండి వస్తువులు దొంగలించగా ఐదున్నర తులాల బంగారం, మిగతా రెండు తులాలకు సంబంధించి నగదు రికవరీ చేయడంతో పాటు వెండిని పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఈ నెల 1వ తేదీన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాసిపేట ఎస్సై గంగారాం, పోలీసులు ఉన్నారు.

గుండెపోటుతో కాగజ్‌నగర్ ఆర్డీవో మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్


జాడి రాజేశ్వర్ (ఫైల్)

ఆసిఫాబాద్/ఉట్నూర్‌రూరల్: కుమురంభీం జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాగజ్‌నగర్ ఆర్డీవో జాడి రాజేశ్వర్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పనిచేసిన రాజేశ్వర్ హఠాన్మరణం పొందడంతో ఆయనతో పనిచేసిన ఉద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం కాగజ్‌నగర్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారానికి ఓసారి స్వగ్రామానికి వస్తుంటారు. కుటుంబంతో గడిపేందుకు సోమవారం సాయంత్రం సొంతూరికి వచ్చారు. తిరిగి విధులకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం సిద్ధమయ్యారు. స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లిన ఆయన చాలాసేపటి వరకు బయటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బాత్‌రూం తలుపులు పగులగొట్టారు. అచేతనంగా కిందపడి ఉన్న రాజేశ్వర్‌ను హుటాహుటిన కారులో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

జాడి రాజేశ్వర్ తన ఉద్యోగ ప్రస్థానాన్ని టైపిస్ట్‌గా ప్రారంభించారు. ఆ తర్వాత జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీవోగా అంచెలంచెలుగా ఎదిగారు. ఉట్నూర్, ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేసిన అనంతరం 2022 నవంబర్ 10న కాగజ్‌నగర్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్‌వోగానూ ఆయన సేవలందించారు.

ప్రముఖుల సంతాపం

ఆర్డీవో రాజేశ్వర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని ప్రముఖులు ఆయన స్వగ్రామానికి చేరుకున్నారు. కుమురంభీం జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే కుమురంభీం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ డీఏవో రఫత్, తహసీల్దార్ సాయన్న, డీటీ పోచయ్య, రాంలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్కే న్యూటెక్ గనికి ప్రజాభిప్రాయ సేకరణ

- ప్రగతి మైదానంలో ఏర్పాట్లు
- పునర్ ధ్రువీకరణకు అనుమతులు కోరుతూ కార్యక్రమం


సీఈఆర్ క్లబ్ వద్ద చేసిన ఏర్పాట్లు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే న్యూటెక్ భూగర్భ గనికి సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం నేడు (బుధవారం) జరుగనుంది. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో కలెక్టర్ సమక్షంలో కాలుష్య నియంత్రణ మండలి(నిజామాబాద్) అధికారులు ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టనున్నారు. దీని కోసం ఏరియా అధికారులు ఇక్కడ అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అయితే ఈ గని పాత గనే అయినప్పటికీ 2006లో కేంద్ర అటవి, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన కొత్త ఉత్తర్వులకు లోబడి ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టుతున్నారు. 1983లోనే ఈ భూగర్భ గని ఏర్పడింది. నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రాంతంలో 327.4 హెక్టార్ల అటవి భూమి కింద ఈ గని విస్తరించి ఉంది.

మరో ఐదేళ్ల జీవిత కాలం..

గనికి మరో ఐదేళ్ల జీవిత కాలం ఉంది. గని ప్రారంభంలో తీసుకున్న అనుమతులతో ఇన్నాళ్లు గనిని నడిపారు. అయితే 2006లో కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం వీటిని పునర్ ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంది. ఇంకా 1.32 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తీసుకోవడం కోసం ఈ పర్యావరణ అనుమతి నేడు తప్పనిసరైంది.

- గని పేరు: ఆర్కే న్యూటెక్
- స్వరూపం: భూగర్భ గని
- గని విస్తీర్ణం: 327.4 హెక్టార్లు
- గని ఆవిర్భాం: 1983
- గుర్తించిన నిల్వలు : 28.83 మిలిమియన్ టన్నులు
- వెలికితీయడానికి అనుకూలం: 17.32 మిలియన్ టన్నులు
- ఇప్పటికి తీసిన నిల్వలు: 12.19 మిలియన్ టన్నులు
- మిగిలిన నిల్వలు: 1.32 మిలియన్ టన్నులు
- సాలీనా ఉత్పత్తి: 0.33 మిలియన్‌టన్నులు
- మిలిగి ఉన్న జీవిత కాలం: 5 సంవత్సరాలు

క్షణికావేశంతో ఆత్మహత్యలు

- ఆత్మహత్యలకు స్పాట్‌గా గోదావరి వంతెన
- ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఆనవాళ్లు


గోదావరి బ్రిడ్జిపై ఎస్‌కే.పాషా బ్యాగు, చెప్పులు

జైపూర్: గోదావరి వంతెనపైన ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. క్షణికావేశంతో గోదావరి నదిలో దూకి ఆత్మహత్యలు చేసుకుంటూ ఇటూ కన్నవారికి అటూ కట్టుకున్నవారికి తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. ఒక్క రోజునే ఇద్దరు జిల్లా వాసులు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీరాంపూర్ ఆర్కే–8ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకినట్లుగా బ్రిడ్జిపైన ఆనవాళ్లు లభించాయి. ఇటీవల వరుసగా గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన రేకెత్తిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో అన్నారం, పార్వతి బ్యారేజిల మధ్యన గోదావరి నదిలో పుష్కలంగా నీరు ఉంటుంది. మరో వైపు గోదావరి బ్రిడ్జినే స్పాట్‌గా ఎంచుకుంటున్న వారు క్షణికావేశంలో దూకి ఆత్మహత్యలకు పాల్పడటం అందరిని ఆందోళనకు గురిచేస్తోంది. పెద్దపల్లి–మంచిర్యాల జిల్లా సరిహద్దు ప్రాంత గోదావరి బ్రిడ్జిపై నుంచి శ్రీరాంపూర్ ఆర్కే–8 కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీరాంపూర్ ఆర్కే–8కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి ఎస్‌కే–పాషా ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్స్‌లో ఒక్కరి షూరిటీగా ఉండగా అతడు డబ్బులు చెల్లింకపోవడంతో ఎస్‌కే పాషాను వేధించడం మొదలుపెట్టారు. దీంతో చీట్‌ఫండ్స్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా లేఖ రాసి ఉంచాడు. ఆయన బ్యాగు, చెప్పులు ఆయన రాసిన లేఖను పోలీసులు గుర్తించారు. ఇదే శ్రీరాంపూర్ ఆర్కే–8ప్రాంతానికి చెందిన చందనవేని మోహన్ యాదవ్ అనే మరో యువకుడు స్నేహితులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫోన్ చేయగా దాన్ని జీర్ణించుకోలేని మోహన్ గోదావరి వంతెనపై బైక్ పెట్టి కనిపించకుండాపోయాడని, అతడి ఫోన్ ట్రాక్ సైతం కనిపించకపోవడం ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కార్మికుడు ఆత్మహత్య

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కే కాలనీకి చెందిన గీగులా అఖిల్(30) సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగుచూసింది. ఎస్సై రాజేశ్ వివరాల తెలిపారు. అఖిల్ తండ్రి అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన స్థానంలో అఖిల్‌కు సింగరేణి ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఎస్సార్పీ 3 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. అఖిల్ తన తల్లితో కలిసి ఆదివారం వారి స్వగ్రామమైన ఖాజీపేటకు వెళ్లాడు. సోమవారం ఒక్కడే తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతరులతో స్నేహం చేయవద్దన్నందుకే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని సోదరుడు అభినవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భర్తకు ఏడాది జైలు

బెల్లంపల్లి: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు మంగళవారం బెల్లంపల్లి న్యాయస్థానం ఏడాది జైలుశిక్ష, జరిమానా విధించింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ వివరాల ప్రకారం.. యుగేందర్ తన భార్య మణీంద్రను అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో 2015లో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఏఎస్సై రమేష్ కేసు నమోదు చేయగా ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ముకేష్ పైవిధంగా తీర్పు చెప్పారు.